సాక్షి ఖమ్మం

ఆదివారం । 13 । ఆగస్టు । 2023



బుట్టదాఖలైన 'ఉచిత విద్య'

ఉచిత విద్య హామీ నెరవేరకపోవడంతో పేదలు ఉన్నత చదువుకు దూరమవుతున్నారని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. 10లో



.. బలి తీసుకున్న కరెంట్

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో పొలాల్లో పనిచేస్తున్న ఇద్దరు రైతులు విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డారు. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 25°

వాతావరణం

జిల్లాలోని పలు చోట్ల ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జాతీయ జెండా ఎగరవేయనున్న మంత్రి పువ్వాడ



అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 15న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న వేడుకల్లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. జిల్లాకేంద్రాల్లో మువ్వన్నెల జెండా ఆవిష్కరించే అతిథుల పేర్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈసందర్భంగా ఖమ్మం వేడుకల్లో మంత్రి పువ్వాడ అజయ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాక ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

15న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి మిడిల్ లాంగ్ డిస్టెన్స్ రన్ ఎంపిక పోటీలు ఈనెల 15న నిర్వహించనున్నట్లు అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. అండర్–14, 16, 18 విభాగాలతో పాటు సీనియర్ పురుషుల, మహిళల విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే ఈ పోటీల్లో ప్రతిభ చాటిన వారిని ఈనెల 20న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

జమలాపురంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీవారి పాదంతో పాటు మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్యకల్యాణం జరిపించారు. అలాగే, తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా హాజరైన భక్తుల సమక్షాన పల్లకీ సేవ చేశారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు భవనాన్ని పరిశీలించిన జిల్లా జడ్జి



కోర్టు భవన ప్లాన్‌ను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి జగ్జీవన్‌కుమార్

మధిర: శిథిలావస్థలో ఉన్న మధిర కోర్టు భవనాన్ని శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జగ్జీవన్ కుమార్ పరిశీలించారు. న్యాయమూర్తి నివాస గృహాన్ని కూడా పరిశీలించాక నూతన కోర్టు నిర్మాణ ప్లాన్ వివరాలు తెలుసుకున్నారు. కాగా, తాత్కాలిక భవనంలో కోర్టు సాగుతుండగా ఎదురవుతున్న ఇబ్బందులను భవన నిర్మాణ కమిటీ చైర్మన్ కట్టా పూర్ణచంద్రరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజడ్ల పుల్లారావు వివరించారు. ఈమేరకు పనులు వేగంగా పూర్తయ్యేలా చొరవ చూపాలని కోరారు. న్యాయవాదులు సుంకు మోహన్‌దాస్, సంబూరు జనార్దన్‌రావు, చావలి రామరాజు, నెల్లూరు రవికుమార్, పల్లపోతుల కృష్ణారావు, సతీష్, విజయ్‌కుమార్, ట్రెయినీ ఐపీఎస్ అవినాష్‌కుమార్, ఆర్‌అండ్‌బీ అధికారులు రాజేష్, శంకర్‌రావు, ఎస్‌ఐ రాజేష్, ఉద్యోగి వెంకన్న పాల్గొన్నారు.

మాత్రల పంపిణీపై ఆరా

కల్లూరు: వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన చేపట్టిన బోదకాలు నివారణ మాత్రల పంపిణీని ప్రపంచ ఆరోగ్య సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రకుమార్ సింగ్ శనివారం పరిశీలించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో మాత్రల పంపిణీని పరిశీలించి మాట్లాడారు. బోదకాలు వ్యాధి దోమల ద్వారా సంక్రమిస్తుందని, ఇది ముదిరితే సొంతంగా పని చేసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందన్నాని చెప్పారు. ఈమేరకు ప్రతీ ఒక్కరు వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు మాత్రలు తప్పక మింగాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉద్యోగులు మోహన్, గుండపనేని రామారావు, బయ్యవరపు ఇందిర, రజని, తార, మరియకుమారి, జమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం ప్రకాష్‌నగర్ బ్రిడ్జి వద్ద మున్నేటిని పరిశీలిస్తున్న ఈఎన్‌సీ మురళీధర్, అధికారులు



వెంకటేశ్వరనగర్ వద్ద పరీవాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు



వరదకు అడ్డుకట్ట !

మున్నేరును ఆనుకుని ఖమ్మం నగరం పొడవునా ఆర్‌సీసీ కాంక్రీట్ వాల్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. గత నెల 27న మున్నేటికి వచ్చిన వరదను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం తాజాగా కేబినెట్ భేటీలో నిర్మాణానికి ఆమోదముద్ర వేసి రూ.150 కోట్లు కూడా మంజూరు చేసింది. ఈ నిధులతో త్వరలోనే పనులు ప్రారంభం కానుండగా, శనివారం జల వనరుల శాఖ ఉన్నతాధికారులు మున్నేటి పరీవాహక ప్రాంతాన్ని సందర్శించారు. మున్నేరుకు కొన్నేళ్లుగా వస్తున్న వరద, ఆ సమయంలో ప్రవాహ వేగం, ముంపు ప్రాంతాల వివరాలపై ఆరా తీశారు. కాగా, కాంక్రీట్ వాల్ నిర్మాణం పూర్తయితే మున్నేటికి ఇరువైపులా ఖమ్మం నగరంతోపాటు ఖమ్మంరూరల్ మండలాల్లో కాలనీలకు వరదముప్పు తప్పనుంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

మున్నేరు వద్ద ఆర్‌సీసీ కాంక్రీట్ వాల్

- రెండు వైపులా 13 కి.మీ. మేర నిర్మాణానికి అడుగులు
- ఇప్పటికే రూ.150కోట్ల నిధులు మంజూరు
- పరిశీలించిన జలవనరుల శాఖ ఉన్నతాధికారులు

అతలాకుతలం

గత నెల 26న అర్ధరాత్రి మున్నేటిలో 15 అడుగుల మేర నీరు ఉండగా.. రాత్రికి రాత్రి పెరుగుతూ 27వ తేదీ ఉదయానికి 25 అడుగులకు చేరింది. ఆతర్వాత మరింత ఉధృతరూపం దాల్చి సాయంత్రం ఐదు గంటలకల్లా 30.70 అడుగులకు చేరడంతో సుమారు 15వరకు కాలనీల్లోని వేలాది ఇళ్లు నీట మునిగాయి. దీంతో ముంపు ప్రాంతాల ప్రజలు కట్టుబట్టలతో రెండు రోజులపాటు పునరావాస కేంద్రాలకే పరిమితమయ్యారు. ఈ వరదలతో ఖమ్మం నగరం, ఖమ్మంరూరల్ మండలాల్లో 2,341 ఇళ్లకు నష్టం జరిగినట్లు అధికారులు ఇప్పటికే సర్వేలో గుర్తించగా, చాలా ఇళ్ల ప్రహరీలు కూలిపోయి, గృహోపకరణాలు కొట్టుకుపోయాయి.

2005 తర్వాత మళ్లీ..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కురిసిన వర్షాలతో గత నెల 27న మున్నేరుకు వరద ఉధృతి ఒక్కసారిగా పెరిగింది. చివరిసారి 2005లో ఈ స్థాయిలో వరదలు రాగా.. అప్పట్లో ఇన్ని కాలనీలు లేకపోవడంతో వరదనీరు సాఫీగా సాగింది. కానీ ఇప్పుడు మున్నేరు పరీవాహక ప్రాంతంలోని బఫర్‌జోన్‌లో వేలాది ఇళ్లు నిర్మించడం, ఏటికి ఆనుకుని వెంచర్లు ఏర్పాటు కావడంతో భవిష్యత్‌లో వరద వస్తే నష్టం రెట్టింపవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో మున్నేరుకు ఇరువైపులా బఫర్‌జోన్‌లో నిర్మాణాలను కట్టడి చేయడమే కాక ప్రస్తుతం ఉన్న ఇళ్లకు నష్టం వాటిల్లకుండా చర్యలకు ఉపక్రమించారు.

కరకట్ట నిర్మించాలని అనుకున్నా...

మున్నేరుకు ఈ ఏడాది వరదను పరిగణనలోకి తీసుకున్న అధికారులు భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా కరకట్ట నిర్మించడమే పరిష్కారమని భావించారు. కానీ భూసేకరణ సమస్య తలెత్తుతుందనే ఉద్దేశంతో ఉపసంహరించుకుని ఆర్‌సీసీ కాంక్రీట్‌వాల్ నిర్మించాలనే నిర్ణయానికి వచ్చారు. ఇక్కడ ఆర్‌సీసీ కాంక్రీట్‌వాల్ ఆవశ్యకతను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా కేబినెట్ భేటీలో ఆమోదముద్ర వేయడమే కాక రూ.150 కోట్లు మంజూరు చేశారు. దీంతో మున్నేరుకు ఇరువైపులా ఖమ్మంరూరల్ మండలం వైపు ఆరున్నర కిలోమీటర్లు, ఖమ్మం నగరం వైపు ఆరున్నర కిలోమీటర్లు మొత్తం 13 కిలోమీటర్ల మేరకు ఆర్‌సీసీ కాంక్రీట్‌వాల్ నిర్మించనుండడంతో పరీవాహక ప్రాంత ప్రజల ఇక్కట్లు తీరనున్నాయి.

జలవనరుల శాఖ అధికారుల పరిశీలన

జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ మురళీధర్ శనివారం మున్నేరు పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ కాంక్రీట్ వాల్ నిర్మాణానికి అనుమతి లభించిన నేపథ్యాన ప్రకాశ్‌నగర్, జలగంనగర్, మున్నేరు బ్రిడ్జి ప్రాంతాల్లో పర్యటించి వరద ఉధృతి, ప్రవాహ వేగం, ఎన్ని ఇళ్లకు నష్టం జరిగిందనే వివరాలు ఆరా తీసి అంచనాలు సిద్ధం చేయడంపై అధికారులకు సూచనలు చేశారు. అలాగే, పద్మావతి నగర్, బొక్కలగడ్డ, దానవాయిగూడెం, రంగనాయకులగుట్ట ప్రాంతాల్లో మూడు చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి అనువైన ప్రాంతాలను కూడా పరిశీలించారు. ఈఎన్‌సీ వెంట సలహాదారు విజయప్రకాష్, సీఈ గుగులోత్ శంకర్‌నాయక్, ఎస్‌ఈలు ఆనంద్‌కుమార్, నర్సింగరావు, ఈఈలు అనన్య, ఎం.వెంకటేశ్వర్లు, డీఈ ఉదయ్‌ప్రతాప్ తదితరులు ఉన్నారు.

ఆరు లింక్ రోడ్లు.. రూ.13.10కోట్లు

- రఘునాథపాలెం మండలానికి నిధులు
- త్వరలోనే మొదలుకానున్న పనులు



అభివృద్ధి చేయనున్న చిమ్మపుడి నుంచి మంచుకొండ లింక్ రోడ్డు

రఘునాథపాలెం: మండలంలోని పలు రహదారులకు మహర్దశ పట్టనుంది. పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఆరు లింక్‌రోడ్ల అభివృద్ధి, నిర్మాణానికి రూ.13.10 కోట్లు మంజూరు చేస్తూ శనివారం జీఓ వెలువడింది. దీంతో తండాలకు ఉన్న లింక్ రోడ్లు ఇక తారురోడ్లుగా అభివృద్ధి చెందనున్నాయి. మండలంలోని ఆయా గ్రామాల ప్రజల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజజయ్‌కుమార్ చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించగా వారు కృతజ్ఞతలు తెలిపారు. వివిధ గ్రామాలను కలుపుతూ ఉన్న ఆరు మట్టి రోడ్లను బీటీగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరైన నేపథ్యాన త్వరలోనే పనులు ప్రారంభించి పూర్తి చేయించేలా చొరవ తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. కాగా, అడిగిన వెంటనే రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంత్రి పువ్వాడ కృతజ్ఞతలు తెలిపారు.

ఎక్కడెక్కడ?

రఘునాథపాలెం మండలానికి కొత్తగా మంజూరైన రహదారుల వివరాలిలా ఉన్నాయి. పంగిడి నుంచి లచ్చిరాంతండా వరకు లింక్ రోడ్డును బీటీగా అభివృద్ధి చేసేందుకు రూ.2.40 కోట్లు మంజూరయ్యాయి. అలాగే, రాములుతండా నుంచి కోర్లబోడుతండా క్రాస్ వరకు రూ.2 కోట్లు, మంచుకొండ నుంచి సుకినితండా వరకు రూ.1.70 కోట్లు, మంచుకొండ నుంచి చిమ్మపుడి వరకు రూ.1.50 కోట్లు, బూడిదంపాడు నుంచి వాంకుడోతుతండా వరకు రూ.3 కోట్లు, పంగిడి నుంచి కొర్రతండా వరకు రూ.2.50 కోట్లతో రహదారిని అభివృద్ధి చేయనున్నారు.

ప్రజల కష్టాలు తీరినట్లే..

ప్రస్తుతం అభివృద్ధి చేయనున్న రహదారులు నడవడానికి కూడా వీలు లేకుండా కంపచెట్లు పెరిగి ఇబ్బందిగా మారాయి. అయినా గ్రామస్తులు తిప్పలు పడుతూనే రాకపోకలు సాగిస్తున్నారు. గ్రామాలకు సులువుగా వచ్చివెళ్లే ఈ లింక్ రోడ్లను బీటీగా మార్చనుండడంతో తమ తిప్పలు తీరినట్లేనని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అలరించిన 'ఝుమ్మంది నాదం'



కార్యక్రమాన్ని ప్రారంభిస్తు అతిథులు

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా కేంద్రంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో శనివారం రాత్రి ఏర్పాటుచేసిన 'ఝుమ్మంది నాదం' స్థానికులను అలరించింది. మొగిలి ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాయనీగాయకులు వీపీ. రెడ్డి, కావేరీ రామారావు, మనోరమ, సదానంద్, చైతన్య, శ్రీలత పాడిన పాటలే కాక సంతోష్ బృందం చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. రైస్‌మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావుతో పాటు ఎలిగి శంకర్, పాలకుర్తి కృష్ణ, జాబిశెట్టి పాపారావు, వీడీఎస్.ప్రసాద్, డాక్టర్ నియాజ్ ఫర్హాద్, మొగిలి గుణాకర్, కొమ్రరాజు మాధవరావు, దిగ్గిరాల రామకృష్ణ, వేములూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైన్స్‌కు 465 దరఖాస్తులు

ఖమ్మంక్రైం: జిల్లాలో 122 వైన్స్ కేటాయింపునకు టెండర్ల దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. ఈమేరకు శనివారం 465 దరఖాస్తులు అందాయి. మొత్తంగా ఇప్పటివరకు 1,307 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలి

యూఎస్‌పీసీ ఆధ్వర్యాన ధర్నాలో వక్తలు

ఖమ్మం సహకారనగర్: గడిచిన తొమ్మిదేళ్లుగా రాష్ట్రంలో విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం రాష్ట్రప్రభుత్వం అవలంబిస్తున్న మొండివైఖరిని ఇకనైనా విడనాడాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ(యూఎస్‌పీసీ) సభ్యులు దేవరకొండ సైదులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కమిటీ ఆధ్వర్యాన ఖమ్మంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నాచౌక్‌కు చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో విద్యాశాఖ పరిస్థితి దయనీయంగా మారిందని తెలిపారు. అన్ని శాఖల్లో ఉద్యోగులకు పదోన్నతులు వచ్చి, బదిలీలు జరుగుతున్నా ఉపాధ్యాయుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా సమస్యలను ఈనెల 31వ తేదీలోగా పరిష్కరించకపోతే సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు రాయల నాగేశ్వరరావు, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, శివరామకృష్ణ మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ ధర్నాకు యూఎస్‌పీసీ బాధ్యులు వి.వెంకటేశ్వరరావు, జి.నాగమల్లేశ్వరరావు, జి.యాదగిరి, షేక్ హసన్, బి.బాబురావు అధ్యక్షత వహించగా, టీపీటీఎఫ్, టీఎస్‌యూటీఎఫ్, ఎస్‌టీఎఫ్, టీఎస్‌పీటీఏ, టీటీఎఫ్ నాయకులు ఎస్.విజయ్, పి.నాగేశ్వరరావు, షేక్ మన్సూర్, ఎన్.రామకృష్ణ, బి.బస్సీలాల్, షేక్ మహబూబ్, రంజాన్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీగా వస్తున్న యూఎస్‌పీసీ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

అడుగడుగునా ఉద్రిక్తత



రఘునాథపాలెం సెంటర్‌లో రైతులు, నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

- నాగ్‌పూర్–అమరావతి హైవే భూసేకరణకు సర్వే
- అడ్డుకున్న రైతులు, సంఘాల నాయకులు
- భారీ బందోబస్తు, సర్వేను పరిశీలించిన అధికారులు



భూసేకరణకు సర్వే చేస్తున్న ఉద్యోగులు



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, అధికారులు

రఘునాథపాలెం: నాగ్‌పూర్ నుంచి అమరావతి వరకు జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూమి సేకరించేందుకు శనివారం చేపట్టిన సర్వేలో అడుగడుగునా ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, ఖమ్మం రూరల్ రెవెన్యూ పరిధిలో తీర్థాల నుంచి రఘునాథపాలెం బైపాస్ వరకు సుమారు 10 కి.మీ. రెవెన్యూ, నేషనల్ హైవే అధికారులు సర్వే చేయాలని నిర్ణయించారు. అయితే, రైతులు అడ్డుకుంటారనే భావనతో శనివారం తెల్లవారుజామునే ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, ఎస్సై కొండల్‌రావు పర్యవేక్షణలో 200మందికి పైగా పోలీసులను మోహరించారు. అనంతరం మూడు మండలాల రెవెన్యూ అధికారులు బృందాలుగా విడిపోయి సర్వేకు ఉపక్రమించారు. ఈక్రమాన నిర్వాసిత రైతులు భారీ సంఖ్యలో చేరుకోగా, వారికి మద్దతుగా రైతు సంఘాల నాయకులు వచ్చారు. అందరూ కలిసి సర్వేను అడ్డుకునేందుకు యత్నించగా పోలీసులతో వాగ్వాదం జరిగింది. రైతు వేగినాటి కిషోర్ పురుగుల మందు తాగేందుకు యత్నించడంతో పోలీసులు డబ్బాను లాక్కోగా ప్రమాదం తప్పింది. అనంతరం రైతులు, రైతు సంఘం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని తరలించాక సర్వే చేపట్టారు. అదనపు కలెక్టర్ మధుసూధన్ నాయక్ పర్యవేక్షించగా ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం తహసీల్దార్లు మేదరమెట్ల శైలజ, విల్సన్‌లూథర్, డీడబ్ల్యూఓ సుమ తదితరులు పర్యవేక్షించారు.

145 అడుగుల మేర రహదారి

సర్వేలో భాగంగా అధికారులు సేకరించాల్సిన భూమికి హద్దులు నిర్ధారించారు. నేషనల్ హైవే కోసం 145 అడుగులు, బ్రిడ్జిల నిర్మాణ ప్రదేశంలో 210 అడుగులుగా హద్దులు పెట్టారు. ఖమ్మం - ఇల్లెందు రోడ్డులో రఘునాథపాలెం వద్ద సర్కిల్‌గా నిర్మించి హైవేకు సర్వీసు రోడ్లు ఏర్పాటుచేయనున్నారు. ఇందుకు అనుగుణంగా సేకరించాల్సిన భూమికి మార్కింగ్ చేశారు. ఈక్రమంలో రోడ్డు పక్కన విలువైన భూములు కోల్పోనున్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలైన్‌మెంట్ మారుతుందా?

నేషనల్ హైవే నిర్మాణానికి సంబంధించి రఘునాథపాలెం మండలంలో సర్వే సాగించారు. కేవలం రఘునాథపాలెం బైపాస్ రోడ్డు వరకు సర్వే చేపట్టిన ఆతర్వాత దృష్టి సారించలేదు. దీంతో నూతన కలెక్టరేట్ వద్ద హైవే అలైన్‌మెంట్ మారనుందనే ప్రచారం మొదలైంది. గతంలోనే ఈ విషయమై జిల్లా ప్రజాప్రతినిధులు నూతన కలెక్టరేట్ సమీపాన హైవే నిర్మిస్తే రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతుందని సూచనలు చేశారు. కలెక్టరేట్‌కు అవతల వైపు వీ.వీ.పాలెం దాటాక రోడ్డు నిర్మించాలనే ప్రతిపాదనలు సమర్పించారు. ఈక్రమంలోనే సర్వే మధ్యలో ఆపేసినట్లు సమాచారం.

మార్కెట్ ధర ప్రకారమే పరిహారం చెల్లించాలి

ఖమ్మంమయూరిసెంటర్: హైవే నిర్మాణంలో రైతులకు అన్యాయం జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదని కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధి, హైవేల నిర్మాణాలకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని చెప్పారు. మార్కెట్ ధర ఆధారంగా రైతులకు నష్టపరిహారం చెల్లించాలనేదే తమ ప్రధాన డిమాండ్ అని తెలిపారు. రఘునాథపాలెంలో ప్రస్తుతం ఎకరం ధర రూ.కోట్లలో ఉన్న నేపథ్యాన రూ.19 లక్షలే చెల్లిస్తాననడం సరికాదని పేర్కొన్నారు. అంతేకాకుండా భూములు ఇచ్చేది లేదని సర్వే స్థలానికి వచ్చిన రైతులను అరెస్ట్ చేయడం అక్రమమని పొంగులేటి ఓ ప్రకటనలో తెలిపారు.

ఏకధాటిగా కుండపోత

మధిర, బోనకల్‌ల్లో భారీ వర్షం

మధిర/బోనకల్: మధిర పట్టణంలో శనివారం భారీ వర్షం కురిసింది. కొద్దిరోజులుగా ఎండలు మండిపోతుండగా, పత్తి, మిర్చి సాగు చేసిన రైతులు వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు. ఇంతలోనే శనివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురవడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. కాగా, పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలవడమే కాక రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వరద పోటెత్తడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇక బోనకల్‌లో కూడా రెండు గంటల పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో ఫ్లై ఓవర్ బ్రిడ్జిని ఆనుకుని ఉన్న రహదారి కాల్వను తలపించింది. ఇక్కడ డ్రెయినేజీ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరంతా రోడ్డుపైకి చేరగా వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.



మధిర ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు



బోనకల్‌లోని ఫ్లై ఓవర్ రహదారిపై వరద ప్రవాహం

బీసీలందరికీ 'బంధు'

బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీల్లోని అన్ని కులాలకు తక్షణమే బీసీ బంధు అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈమేరకు నల్లరిబ్బన్లు ధరించిన పార్టీ నాయకులు శనివారం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి మయూరిసెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి వినతిపత్రం సమర్పించాక సత్యనారాయణ మాట్లాడుతూ బీసీల్లోని కొన్ని కులాలకు మాత్రమే రూ.లక్ష రుణాలు ఇవ్వటం మిగతా వారిని అవమానపర్చడమేనని పేర్కొన్నారు. ఇకనైనా రైతుబంధు, దళిత బంధు మాదిరిగా బీసీల్లోని అన్ని కులాలకు బీసీ బంధు ప్రకటించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు టీకుమట్ల వీరుగౌడ్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు జ్వాలా నర్సింహారావు, డాక్టర్ శీలం పాపారావు, రేఖా సత్యనారాయణ, వెంకట్, మాధవ్, దొంగల సత్యనారాయణ, అల్లిక అంజయ్య, నకిరికంటి వీరభద్రం, మందా సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

రెండు సీట్లలో అవకాశం కల్పించండి

ఉమ్మడి జిల్లాలో కనీసం రెండు అసెంబ్లీ స్థానాల నుంచి బీసీలకు పోటీ చేసే అవకాశం కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి కోరారు. ఈసందర్భంగా వారు శనివారం బీజేపీ, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, ఉపేంద్రసాహు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని హరిచంద్రకు వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. బీసీలకు సీట్లు కేటాయించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. నాయకులు లింగబోయిన పుల్లారావు, సుగుణ, చల్లా హన్మంతు, పామర్తి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు

క్లుప్తంగా

శివాలయంలో ఫ్యామిలీ కోర్టు జడ్జి పూజలు



పూజల్లో పాల్గొన్న జడ్జి, అరుణకుమారి, కుటుంబీకులు

కూసుమంచి: కూసుమంచిలోని శివాలయం(గణపేశ్వరాలయం)లో శనివారం జిల్లా ఫ్యామిలీ కోర్టు జడ్జి అరుణకుమారి కుటుంబసభ్యులతో కలిసి పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శేషగిరిశర్మ పూజలు, అర్చన చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ కొక్కిరేణి వీరస్వామి, డైరెక్టర్లు జడ్జిని సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

అండర్-16 క్రికెట్ టోర్నీ ప్రారంభం



విజేతగా నిలిచిన సత్తుపల్లి జట్టు

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన నియోజకవర్గాల స్థాయి అండర్-16 బాలుర క్రికెట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ పోటీలను డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో క్రికెట్‌కు ఎంతో ఆదరణ ఉందని.. క్రీడాకారులు కనీసం రంజీ స్థాయి వరకైనా వెళ్లేలా కష్టపడాలని సూచించారు. క్రికెట్ అసోసియేషన్ బాధ్యులు ఎండీ మసూద్‌పాషా, ఎండీ ఫారుఖ్, తరుబ్ అలీ తదితరులు పాల్గొన్నారు. కాగా, తొలుత ఖమ్మం – సత్తుపల్లి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ చేసిన ఖమ్మం జట్టు 9 వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. అనంతరం వర్షం రావడంతో అంతరాయం ఏర్పడగా, సత్తుపల్లి జట్టుకు ఓవర్లు తగ్గించి అవకాశం కల్పించారు. ఈ మేరకు ఆరు వికెట్ల నష్టానికి 79 పరుగులు చేయడంతో విజేతగా నిలిచినట్లు ప్రకటించారు.

జేవీఆర్ కళాశాల అధ్యాపకులకు డాక్టరేట్



కృష్ణారావు



చెన్నారావు

సత్తుపల్లి/వేంసూరు: వేంసూరు మండలంలోని వెన్నచేడు వెంకటాపురానికి చెందిన తెల్లగొర్ల కృష్ణారావుకు డాక్టరేట్ లభించింది. గ్రామంలోని వెంకటేశ్ – సీతమ్మ కుమారుడైన ఆయన సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రొఫెసర్ డాక్టర్ వికాస్‌కుమార్ పర్యవేక్షణలో 'ది ఆప్టిమాలిటీ ఆఫ్ క్యాపిటల్ స్ట్రక్చర్ టెక్నిక్స్ ఇన్ బీఎస్ఈ ఎంటర్‌ప్రైజెస్' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గాను మధ్యప్రదేశ్‌లోని శ్రీకృష్ణ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. అలాగే, జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న దమ్మపేట మండలం గణేష్‌పాడు గ్రామానికి చెందిన ఓరుగంటి చెన్నారావుకు సైతం డాక్టరేట్ లభించింది. ఆయన 'క్వాలిటీ ఆఫ్ ఈ సర్వీస్ కస్టమర్ హ్యాపినెస్ అండ్ బిహేవియరల్ ఇంటెన్షన్స్ ఏ రీసెర్చ్ ఇన్ ది కాంటెక్ట్స్ ఆఫ్ ఇండియన్ రిటైల్ బ్యాంకింగ్' అంశంపై డాక్టర్ నితీష్‌శర్మ పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకృష్ణ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా వీరిని కళాశాల ప్రిన్సిపాల్ పానెం రామచంద్రరావు, అధ్యాపకులు అభినందించారు.

స్వాతంత్య్ర ఉద్యమస్ఫూర్తితో పోరాటం

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో నేతలు



ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కార్పొరేట్ విద్యావ్యవస్థ, పాలకుల అనాలోచిత సంస్కరణలపై స్వాతంత్య్ర స్ఫూర్తితో విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు పోటు ప్రసాద్, బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని పలు చోట్ల జెండా ఆవిష్కరించాక వారు మాట్లాడారు. స్వాతంత్య్ర సంగ్రామంలో ఉద్యమించిన మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని గుర్తుచేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలోనూ పోరాటం చారిత్రకమైనదని చెప్పారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ, శ్వేతతో పాటు దండి సురేశ్, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఇటికాల రామకృష్ణ, నానబాల రామకృష్ణ, మునిగి కోటి, సతీశ్, గోపి, చందూలాల్, శశి, పవన్ పాల్గొన్నారు.

ఐటీ రంగ అభివృద్ధికి కృషి

- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- ఇన్ఫోసిస్ కంపెనీతో ఎస్‌బీఐటీ ఎంఓయూ



ఎస్‌బీఐటీ చైర్మన్ కృష్ణ, ఇన్ఫోసిస్ ప్రతినిధులతో మంత్రి పువ్వాడ అజయ్

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో ఐటీ రంగం అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐటీలో శనివారం సక్సెస్ మీట్ నిర్వహించారు. ఇదేసందర్భంగా ఇన్ఫోసిస్ కంపెనీతో ఎంఓయూ కుదుర్చుకున్నారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ అధ్యతన జరిగిన సమావేశంలో మంత్రి పువ్వాడ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఈసారి ఎక్కువ మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్ లభించడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రముఖ బహుళజాతి కంపెనీ ఇన్ఫోసిస్‌తో ఒప్పందం కుదరడం విద్యార్థుల భవిష్యత్‌కు తోడ్పడుతుందన్నారు. ఎస్‌బీఐటీ చైర్మన్ కృష్ణ మాట్లాడుతూ ఇన్ఫోసిస్ కంపెనీ బాధ్యులు నూతన ఆవిష్కరణలు, విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేలా శిక్షణ ఇస్తారని తెలిపారు. గత రెండేళ్లలో 600మంది విద్యార్థులు సాధించటం తమ కళాశాల కృషికి ఫలితం దక్కినట్లయిందని చెప్పారు. అనంతరం ఎంఓయూకు సహకరించిన ఇన్ఫోసిస్ కంపెనీ ప్రతినిధులు నివాస్, సిమ్రాన్‌తో పాటు ప్లేస్‌మెంట్లు పొందిన విధ్యార్థులను మంత్రి అజయ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి. మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్లు ప్రశాంతలక్ష్మి, కర్నాటి కృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అమిత్ బింధాజ్‌తో పాటు గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఏ.వీ.వీ.శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, డాక్టర్ జి.సుభాష్‌చందర్, డాక్టర్ జె.రవీంద్రబాబు, డాక్టర్ శ్రీనివాసరావు, ఎస్.సవిత, ఎ.మల్లికార్జున్ పాల్గొన్నారు.

మెరుగైన పనితీరుతోనే ప్రజల మన్ననలు

ఎన్పీడీసీఎల్ పవర్ ఇంజనీర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యేశ్వరరావు



రఘోత్తమరెడ్డి, అధ్యక్షుడు



నాగమల్లేశ్వర రావు, కార్యదర్శి

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ వినియోగదారులకు పవర్ ఇంజనీర్లు జవాబుదారీగా ఉంటూ మెరుగైన పనితీరు ద్వారా వారి మన్ననలు పొందాలని ఎన్పీడీసీఎల్ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నార్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు సూచించారు. ఎన్పీడీసీఎల్ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పవర్ డిప్లొమా ఇంజనీర్ల అసోసియేషన్ ఎన్నికలు ఖమ్మంలో శనివారం జరిగాయి. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని తెలిపారు. ఇంజనీర్ల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఇంద్రసేనారెడ్డితో పాటు జి.బాపయ్య, మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో రెండు జిల్లాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖమ్మం సర్కిల్ డిప్లొమా ఇంజనీర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా సీహెచ్ రఘోత్తంరెడ్డి, కార్యదర్శిగా గొల్లపూడి నాగమల్లేశ్వరరావు, కోశాధికారి ఎం.నాగరాజు ఎన్నికయ్యారు. అలాగే, ఖమ్మం టౌన్ డివిజన్ కార్యదర్శిగా జె.ప్రభాకర్‌రావు, కోశాధికారిగా ఎస్.శ్రీనివాస్, ఖమ్మం రూరల్ డివిజన్ కార్యదర్శిగా ఎస్.రామారావు, కోశాధికారిగా బి.రామ్మోహన్, వైరా డివిజన్ కార్యదర్శిగా బి.నాగేశ్వరరావు, కోశాధికారిగా కె.చరణ్, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శిగా ఎం.జిలానీ, కోశాధికారిగా వి.సతీశ్, మహిళా ప్రతినిధిగా కె.నవ్య, కార్యాలయ కార్యదర్శిగా వై.సాయికిరణ్ ఎన్నికైనట్లు ప్రకటించారు.

భద్రాద్రికొత్తగూడెం జిల్లా కార్యవర్గం..

భద్రాద్రికొత్తగూడెం జిల్లా డిప్లొమా ఇంజనీర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా బి.నరేశ్, కార్యదర్శిగా రఘురామయ్య, కోశాధికారిగా డి.శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఇంకా కొత్తగూడెం డివిన్ కార్యదర్శిగా జి.కిషన్, కోశాధికారిగా గౌతమ్, భద్రాచలం డివిజన్ కార్యదర్శిగా రాజారావు, కోశాధికారిగా నరేశ్, సెంట్రల్ డివిజన్ కార్యదర్శిగా కె.లింగయ్య, కోశాధికారిగా సల్మాను ఎన్నుకున్నారు.

అటవీ భూమిలో మొక్కల తొలగింపు



మొక్కలను తొలగిస్తున్న అటవీ అధికారులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని గుడిపాడు పరిధి తామర చెరువు సమీపాన రిజర్వ్ ఫారెస్ట్ భూమిలో సాగు చేసిన కంది మొక్కలను శనివారం అటవీ శాఖ అధికారులు తొలగించారు. ఈ ప్రాంతంలో 80 మందికి పట్టాలు ఇవ్వగా, అదనంగా 20 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా మొక్కలు తొలగించడమే కాక బాధ్యులపై సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు అటవీ ఉద్యోగులు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ నాగూర్‌బీ, ఖమ్మం స్క్వాడ్ సెక్షన్ ఆఫీసర్ కిశోర్, ఎఫ్ఎస్ఓలు మంగారావు, నర్సింహ, బీవీ రావు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సర్పంచ్ రోడ్డును ఆక్రమించారని ధర్నా

ఖమ్మంరూరల్: మండలంలోని కాచిరాజుగూడెం సర్పంచ్ పంటపొలాలకు వెళ్లే రహదారిని ఆక్రమించారని ఆరోపిస్తూ రైతులు శనివారం ధర్నాకు దిగారు. మహబూబాబాద్ – ఖమ్మం రహదారిపై ఆందోళనకు దిగిన రైతులు మాట్లాడుతూ ఏళ్లుగా పొలాలకు వచ్చి వెళ్లే రహదారిని సర్పంచ్ ఆక్రమించి తన పొలంలో కలుపుకున్నారని ఆరోపించారు. ఇకనైనా అధికారులు స్పందించి రహదారిని పునరుద్ధరించాలని వారు కోరారు.



రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

ఉపసర్పంచ్, వార్డుసభ్యులపై దాడి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపసర్పంచ్, వార్డు సభ్యులు

రఘునాథపాలెం: గ్రామపంచాయతీ వర్కర్ నియామకంలో ఏకపక్ష నిర్ణయాన్ని ప్రశ్నించినందుకు సర్పంచ్, ఆమె కుమారుడు దాడి చేశారని మండలంలోని వీవీపాలెం ఉపసర్పంచ్ బానోతు లాల్‌సింగ్, పలువురు వార్డు సభ్యులు ఆరోపించారు. గ్రామంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఉపసర్పంచ్ లాల్‌సింగ్, వార్డు సభ్యులు ఉర్లుగొండ రమాదేవి, వడ్డెబోయిన సావిత్రి, భుక్యా సైదమ్మ, తగరం నాగరాజు, తొర్లపాటి కృష్ణవేణి, శంకర్‌తో పాటు గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. ఇటీవల గ్రామపంచాయతీ వర్కర్ చనిపోవడంతో కొత్త వారిని నియమించేందుకు శనివారం పాలకవర్గం సమావేశం ఏర్పాటుచేయగా సర్పంచ్ ఏకపక్ష నిర్ణయాన్ని తాము వ్యతిరేకించినట్లు తెలిపారు. దీనిపై సర్పంచ్ కుమారుడు వాసు జోక్యం చేసుకొని దూషించడమే కాక ఉపసర్పంచ్‌పై కుర్చీ విసిరేశాడని, సర్పంచ్ రావెళ్ల మాధవి సైతం ఉపసర్పంచ్‌పై దాడి చేశారని వాపోయారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు తొలుపునూరి దానయ్య, కూరాకుల సత్యం, తేజావత్ రామోజీ, పోతగాని పుల్లయ్య, తొర్లపాటి లింగయ్య, వర్దబోయిన వెంకటరాములు, కోటమ్మ పాల్గొన్నారు.

నలుగురు మావోయిస్టు కొరియర్ల అరెస్ట్

భద్రాచలంఅర్బన్: నిషేధిత మావోయిస్టు పార్టీ కొరియర్లు నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్పీ డాక్టర్ జి.వినీత్ కథనం ప్రకారం.. శనివారం ఉదయం దుమ్ముగూడెం ఎస్సై పి. కేశవరావు తన సిబ్బంది, సీఆర్పీఎఫ్ 141 బెటాలియన్ సిబ్బందితో కలిసి మండలంలోని గౌరారం గ్రామంలో వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో పైడిగూడెం వైపు నుంచి పెదనల్లబల్లి సెంటర్‌కు అనుమానాస్పదంగా వస్తున్న కారును ఆపేందుకు ప్రయత్నించగా.. కారు ఆపకుండా వెళ్లారు. పోలీసులు వెంబడించి పట్టుకుని విచారణ జరిపారు. వారు కుంజా రఘువరన్, పులిపాటి రవితేజ, బైరెడ్డి సతీష్, ఉబ్బనపల్లి దినేష్ కుమార్‌లుగా, మావోయిస్టు పార్టీ కొరియర్లుగా పనిచేస్తున్నట్లు అంగీకరించారు. వారి నుంచి రూ. 20 లక్షల నగదు, జిలెటిన్ స్టిక్-1, కార్డెక్స్ వైర్ 1/2 మీటర్, డిటోనేటర్-1, రౌండ్స్-2ను స్వాధీనం చేసుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని, కారును సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ టి.సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, సీఆర్పీఎఫ్ అధికారులు ప్రీతా, చౌరసీయా, దుమ్ముగూడెం సీఐ రమేష్ పాల్గొన్నారు.

హైదరాబాద్ బయలుదేరిన ఉద్యోగులు



హైదరాబాద్ వెళ్తున్న సీపీఎస్ ఉద్యోగులు

ఖమ్మంసహకారనగర్: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో హైదరాబాద్‌లో జరిగిన ధర్నాకు జిల్లా నుంచి సీపీఎస్ ఉద్యోగులు వెళ్లారు. తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఎస్‌సీపీఎస్ఈయూ) జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్ ఆధ్వర్యాన బస్సులు, ప్రైవేట్ వాహనాలతో పాటు రైళ్లలో కూడా ఉద్యోగులు బయలుదేరారు. కార్యక్రమంలో నాయకులు పోతురెడ్డి రామగోపి, శ్వేత, సుభాన్, కుమ్మరికుంట్ల ఉప్పలయ్య, కృష్ణవేణి, కరుణ, రామకృష్ణ, సైదునాయక్, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

మేం గెలిస్తే రైతుబంధు ఎకరాకు రూ.20 వేలు

ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్



మాట్లాడుతున్న కేఏ పాల్

ఖమ్మంమామిళ్లగూడెం: వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని పది స్థానాల్లో పోటీ చేసి విజయం సాధించడం ఖాయమని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్ వెల్లడించారు. ఖమ్మం ముస్తఫానగర్‌లోని పార్టీ కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రెండు శాతం ఉన్న అగ్రవర్ణాలే రాష్ట్రాన్ని పాలించాలా, దళితులు పాలించకూడదా అని ప్రశ్నించారు. కాగా, తాము అధికారంలోకి వచ్చాక రైతుబంధు ఎకరాకు రూ.20 వేలు చెల్లించడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీల పాలన తీసుకొస్తామని పాల్ తెలిపారు. కాగా, ప్రజల వద్దకు పాల్ వస్తున్న నేపథ్యాన అందరూ బైబై మోదీ, కేసీఆర్ అంటూ చెప్పాలని పిలుపునిచ్చారు.

అన్నదాతలను బలి తీసుకున్న కరెంట్

- విద్యుత్ షాక్‌తో ఇద్దరు రైతుల మృతి
- జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలు



మోటార్ వద్ద సీతారాములు మృతదేహం



సీతారాములు (ఫైల్)

తిరుమలాయపాలెం: వరి పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లిన ఓ రైతు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందిన విషాద ఘటన మండలంలోని పిండిప్రోలు గ్రామపంచాయతీ పరిధి పాపాయిగూడెంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రైతు పిడియాల సీతారాములు (62) పొలానికి నీరు పెట్టేందుకు ఉదయం నిజాం కుంట సమీపాన వ్యవసాయబావి వద్దకు వెళ్లాడు. మోటార్ ఆన్ చేస్తుండగా షాక్‌కు గురై తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. సీతారాములుకు భార్య అచ్చమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, ఆయన కుటుంబానికి కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేయగా, వివిధ పార్టీల నాయకులు కమ్మ కోమటి నాగేశ్వరరావు, కొండబాల కరుణాకర్, సర్పంచ్ నామా ప్రసాద్ నివాళులర్పించారు.

లంకపల్లిలో మరో రైతు...



శేషాద్రి (ఫైల్)

పెనుబల్లి: విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి చెందిన ఘటన పెనుబల్లి మండలం లంకపల్లిలో చోటు చేసుకుంది. రైతు బోగి శేషాద్రి(50) తనకు ఉన్న ఎకరం పొలంతో పాటు మరో రెండెకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. ఈక్రమంలో శనివారం ఎరువు చల్లే క్రమాన పక్కనే ఉన్న మరో పొలంలోని ఫెన్సింగ్ పట్టుకున్నాడు. అయితే, సమీపాన స్తంభం దగ్గరలోని స్టార్టర్ బాక్స్‌కు కట్టిన జీఏ వైరు ఫెన్సింగ్ తీగలకు తాకి ఉండడంతో షాక్‌తో ఆయన తీగలపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని గమనించిన రైతులు విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అలాగే, వీఎంబంజర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.



తీగలపై రైతు శేషాద్రి మృతదేహం

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి (30) మృతి చెందాడు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు అందిన ఫిర్యాదుతో జీఆర్పీ సిబ్బంది పరిశీలించి అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 94932 18856, 871265 8589 నంబర్లలో సంప్రదించాలని జీఆర్పీ ఎస్ఐ భాస్కర్‌రావు సూచించారు.

బావిలో పడిన ట్రాక్టర్

కూసుమంచి: మండలంలోని పాలేరులో దమ్ము చేస్తున్న ఓ ట్రాక్టర్ ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడిపోయింది. దీంతో ట్రాక్టర్ నీట మునగగా డ్రైవర్ అప్రమత్తమై బయటపడ్డాడు. గ్రామానికి చెందిన రైతు నూకల శ్రీనివాసరెడ్డి పొలంలో ట్రాక్టర్‌తో దమ్ము చేస్తుండగా మడిలో ఉన్న బావి ఒడ్డు మట్టి కుంగగా ట్రాక్టర్ జారి బావిలో పడింది. ఆ వెంటనే ట్రాక్టర్‌ను క్రేన్ సాయంతో బయటకు తీశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 11వ డివిజన్ కవిరాజ్ నగర్‌రోడ్డు నంబర్-12లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో శనివారం సాయంత్రం మంటలు వచ్చాయి. దీంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి సమీప ఇళ్లలోని విద్యుత్ గృహోపకరణాలు కాలిపోయాయి. ఈ విషయమై విద్యుత్ ఏడీ రమేశ్‌ను వివరణ కోరగా.. 11 కేవీ లైన్‌లో సమస్యతో నిప్పురవ్వలు వచ్చాయని, సిబ్బంది సరి చేశారని, ఎవరి ఇళ్లలో పరికరాలు కాలిపోలేదని తెలిపారు.

ప్రైవేట్ బిల్ కలెక్టర్ ఆత్మహత్య

- సబ్సిడీ బిల్లులు వసూలు చేసి వాడుకున్నట్లు ఆరోపణలు
- విచారణ జరుగుతుండడంతో బలవన్మరణం



రాకేష్ (ఫైల్)

మధిర: విద్యుత్ బిల్లుల వసూళ్లలో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో విద్యుత్ ప్రైవేట్ బిల్ కలెక్టర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం జిల్లా మధిరకు చెందిన రాకేష్(36) ఎర్రుపాలెం, మాముసూరు సెక్షన్లలో విద్యుత్ బిల్లులు వసూలు చేస్తాడు. ఎస్సీ, ఎస్టీ వినియోదారుల నుంచి సబ్సిడీ డబ్బు వసూలు చేయకూడదనే నిబంధనలు ఉన్నా ఆయన వసూలు చేసి దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈమేరకు అధికారులు విచారణ జరుపుతుండడంతో రాకేష్ ఈనెల 8న విష గుళికలు మింగి దెందుకూరు రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపాన పడిపోయాడు. ఆరోజు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులకు పోలీసులను ఆశ్రయించగా వారు విచారణ చేపట్టి బ్రిడ్జి సమీపాన సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆగినట్లు గుర్తించారు. ఇంతలోనే 9న ఉదయం రైతులు ఆయనను గుర్తించి మధిర ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, రాకేష్ రూ.3లక్షల మేర బిల్లులు దుర్వినియోగం చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారని సమాచారం. కాగా, కనీస వేతనాలు అందక, ఉద్యోగ భద్రత లేక కుటుంబాన్ని పోషించుకోలేక ప్రైవేట్ విద్యుత్ బిల్ కలెక్టర్లు మనోవేదనకు గురవుతున్నారని తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) కార్యదర్శి ఎం.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ చేయకుండా రాకేష్‌పై విద్యుత్ శాఖ అధికారులు కక్షపూరితంగా వ్యవహరించి ఆత్మహత్యకు కారణమయ్యారని పేర్కొన్నారు. ఆయన కుటుంబాన్ని పరిహారం చెల్లించడమే కాక అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కుటుంబ కలహాలతో యువకుడు..



శ్రీకాంత్ (ఫైల్)

మధిర: కుటుంబ కలహాల నేపథ్యాన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని మహదేవపురానికి చెందిన కనపర్తి శ్రీకాంత్ (22) మధిరలో డిగ్రీ చదువుతూనే రెడీమేడ్ దుకాణంలో పనిచేస్తున్నాడు. శ్రీకాంత్ తల్లిదండ్రుల మధ్య కొంతకాలంగా వివాదం జరుగుతుండగా వారు వేర్వేరుగా నివసిస్తున్నారు. వీరి ఇద్దరు కుమారుల్లో శ్రీకాంత్ తండ్రి వద్ద, చిన్న కుమారుడు తల్లి వద్ద ఉంటున్నారు. తరచుగా గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురైన శ్రీకాంత్ శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సిద్దిపేటలో జురాసిక్ పార్క్



డైనోపార్క్ నిర్మాణానికి రూ.12 కోట్ల వ్యయం
సందర్శకుల కోసం ఓపెన్ ట్రైన్ సౌకర్యం
వారంలో ప్రారంభించేందుకు సన్నాహాలు

వందల ఏళ్ల కిందట అంతరించిపోయిన డైనోసార్లకు హాలీవుడ్ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ వెండితెరపై రూపం ఇచ్చి ప్రాణం పోశారు. 1993లో వచ్చిన జురాసిక్ పార్క్ క్రియేట్ చేసిన ట్రెండ్ అంతా ఇంతా కాదు. ఆ తరువాత కూడా ఆ చిత్రానికి కొనసాగింపుగా అనేక సినిమాలు వచ్చి ప్రేక్షకాదరణ పొందాయి. ప్రజలకు డైనోసార్లపై ఉన్న ఆసక్తిని గమనించి ఆ తర్వాత డైనోసార్ థీమ్‌తో ప్రపంచ వ్యాప్తంగా అనేక నగరాల్లో పార్కులు వెలిశాయి. నూతన సాంకేతికతను ఉపయోగించి నిజంగా ప్రాణం పోసుకున్నాయా అన్నట్టుగా డైనోసార్లను తయారుచేసి ప్రదర్శించారు. అభివృద్ధి చెందిన దేశాలకు దీటైన రీతిలో ఇప్పుడు కొత్తగా డైనోపార్క్ మన తెలంగాణలోనూ అందుబాటులోకి రాబోతుంది. దానికి సిద్దిపేట వేదిక కాబోతుంది.

సాక్షి, సిద్దిపేట

విదేశాల్లోని పార్కుల తరహాలో

డైనోపార్క్ అంటే ఏదో ఎగ్జిబిషన్‌లా బొమ్మలు, 3డీ యానిమేషన్ స్క్రీన్లు కాదు. అమెరికా, సింగపూర్‌లలోని యూనివర్సల్ వరల్డ్ స్టూడియోలో ఉన్న డైనోపార్క్‌ల తరహాలో కోమటిచెరువు సమీపంలో పార్క్ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఈ పార్క్ పనులు ఏడాది కిందట మొదలు కాగా ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. వారంలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

1.5 ఎకరాల విస్తీర్ణంలో..

డైనోసార్ పార్క్‌ను 1.5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ఇందుకోసం సుమారు రూ.12 కోట్లు వెచ్చిస్తున్నారు. ఈ డైనో పార్క్‌లో పెద్ద గుహలు, కొండలు, గుట్టలు, అటవీ ప్రాంతం, లావా, గ్రీనరీ, వాటర్‌ఫాల్స్ ఇలా మూడు వేల శతాబ్దాల కిందట భూమండలం మీద పరిస్థితులు ఎలా ఉండేవో కళ్లకు కట్టినట్టుగా ఏర్పాటు చేస్తున్నారు. పార్కులో వివిధ రకాల డైనోసార్‌లు, వాటి గుడ్లు, అస్థిపంజరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సిలికాన్ డైనోసార్లను ఇక్కడ అందుబాటులో ఉంచుతున్నారు. ఇవి పార్కు ఆవరణలో అటూ ఇటూ కలియతిరుగుతూ భీకరంగా శబ్దాలు చేస్తూ సందర్శకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసేందుకు సిద్ధమవుతున్నాయి.

వాకింగ్ డైనో..

ఈ డైనో థీమ్ పార్క్‌లో వాకింగ్ డైనోసార్‌ను సైతం ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో చిన్నారులు కూర్చుంటే నడుచుకుంటూ వెళ్తుంది. ఒకేసారి ఆరుగురు చిన్నారులు కూర్చునే విధంగా రూపొందించారు. అలాగే లోపల గుహల్లో తిరుగుతున్న సమయంలో సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. డైనోసార్ గుడ్డులో నుంచి పిల్ల బయటకు వస్తుండగా సెల్ఫీ తీసుకునే అవకాశం ఉంటుంది. పార్క్‌ను చూసేందుకు వస్తున్న పిల్లలను అలరించేందుకు డైనోసార్ సూట్ వేసుకుని ఇద్దరు తిరగనున్నారు.

మినీ ట్రాక్.. ఓపెన్ ట్రైన్

డైనోసార్ పార్కులో ఉన్న వింతలు విశేషాలను చూసేందుకు వీలుగా 240 మీటర్ల నిడివితో మినీ ట్రాక్‌ను నిర్మించారు. దీనిపై ఓపెన్‌ట్రైన్ నడుస్తుంది. ఈ ట్రైన్‌లో 3 బోగీలు ఉండగా ఒక్కో బోగీలో ఆరుగురు కూర్చునే వీలుంది. ఈ ఓపెన్ ట్రైన్‌లో తిరుగుతున్న సమయంలో సందర్శకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేలా ఒక్కసారిగా డైనోసార్‌లు మీదపడినట్టు, భీకరంగా అరవడం లాంటివి చేసేలా పార్క్‌ను డిజైన్ చేశారు.

గుజరాత్‌ను మించేలా..

మన దేశంలో గుజరాత్‌లోని రయోలిలో డైనోసార్ గుడ్లు లభించాయి. దీంతో అక్కడ డైనోసార్ మ్యూజియం ఏర్పాటు చేశారు. ఈ మ్యూజియంలో నిలకడగా ఉండే డైనోసార్‌లను ప్రదర్శనకు ఉంచారు. డైనోసార్లలో ఒక్కటి మాత్రమే అరుస్తూ.. తోక ఊపుతుంది. కానీ సిద్దిపేటలో ప్రారంభంకాబోతున్న పార్క్‌లో కదిలే డైనోసార్లు 18 ఉన్నాయి. ఇవికాకుండా మరో ఐదు నిలకడగా ఉండేవి ఏర్పాటు చేశారు. ఒక రకంగా దేశంలో ఇదే అత్యుత్తమ, అత్యంత పెద్ద డైనోసార్ పార్క్ అని అంటున్నారు.



డైనోపార్క్‌లో గుహలు, డైనోసార్‌లు

కొత్త అనుభూతి కలిగిస్తుంది



కోమటి చెరువులో మరో మణిహారంగా డైనోసార్ పార్క్ ఏర్పాటు కాబోతుంది. ఇప్పటికే రాక్‌గార్డెన్, గ్లో గార్డెన్, అడ్వెంచర్ పార్క్‌ల చెంతన వినూత్నమైన రీతిలో కొత్త అనుభూతిని కలిగించేలా డైనోసార్ పార్క్ అందుబాటులోకి రానుంది. సాహస అనుభవాలని, జ్ఞాపకాలని, మధురానుభూతిని కలిగించేలా డైనోసార్ పార్కు ఉంటుంది. దేశంలో ఎక్కడాలేని విధంగా సిద్దిపేటలో ఈ పార్క్ ఉండబోతుంది.

–హరీశ్‌రావు, రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి

అయ్యో.. ఆరేళ్లకే నూరేళ్లు!

- తిరుమల కొండపై బాలికను చంపేసిన వన్యమృగం
- అలిపిరి నడక మార్గంలో శుక్రవారం రాత్రి చిన్నారి అదృశ్యం
- అటవీ ప్రాంతంలో శనివారం మృతదేహం లభ్యం
- చిరుతా, ఎలుగుబంటా అనేది అనుమానం



చిన్నారి లక్షిత (ఫైల్ ఫొటో)



కుమార్తె లక్షిత మృతితో విలపిస్తున్న తల్లి శశికళ

తిరుమల/కోవూరు: తిరుమల కొండపై తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అలిపిరి నడకదారిలో శుక్రవారం రాత్రి ఆరేళ్ల చిన్నారి నడుస్తుండగా అకస్మాత్తుగా ఓ వన్యమృగం చేసిన దాడిలో మృత్యువాత పడింది. నరసింహస్వామి ఆలయం సమీపంలోని అటవీ ప్రాంతం వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మండలం, పోతిరెడ్డిపాళేనికి చెందిన దినేష్‌కుమార్, శశికళ కుమార్తె లక్షిత (6) కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం తిరుపతికి చేరుకున్నారు. మ.3.30 గంటల ప్రాంతంలో వారంతా అలిపిరి నడకమార్గం ద్వారా తిరుమలకు కాలినడకన బయల్దేరారు. రాత్రి 7.30 గంటల సమయంలో బాలిక నరసింహస్వామి ఆలయం సమీపంలో అదృశ్యమైంది. తల్లిదండ్రుల కంటే ముందుగానే ఆ చిన్నారి నడుస్తుండడంతో వేరే భక్తుల గుంపులో కలిసి వెళ్లి ఉంటుందని తల్లిదండ్రులు తొలుత భావించి వెతకడం ప్రారంభించారు. ఎంతకూ కనపడకపోవడంతో చివరికి అక్కడున్న భద్రతా సిబ్బందికి తెలిపారు. రాత్రి 10.30కు తిరుమల టూటౌన్ పోలీసులకు బాలిక అదృశ్యంపై ఫిర్యాదు అందింది. దీంతో తిరుమల వన్‌టౌన్ సీఐ జగన్మోహన్‌రెడ్డి, టూటౌన్ సీఐ చంద్రశేఖర్ అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టారు. రాత్రి నుంచి దాదాపు 70 మంది టీటీడీ, అటవీశాఖ సిబ్బంది, పోలీసులు గాలింపు చేపట్టారు. శనివారం ఉ.6 గంటల ప్రాంతంలో నరసింహస్వామి ఆలయం సమీపంలోని నడకదారి నుంచి 150 మీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో బాలిక మృతదేహాన్ని గుర్తించారు. పూర్తిగా ముఖాన్ని జంతువు తినడంతోపాటు, కాలిని తీవ్రంగా గాయపర్చింది. దీంతో బాలిక అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలుస్తోంది. చిరుత లేదా ఎలుగుబంటి దాడిచేసి ఉండవచ్చని భావిస్తున్నారు.

ఘటన తీవ్రంగా కలిచివేసింది : ఈఓ ధర్మారెడ్డి

చిన్నారి మృతి తమను తీవ్రంగా కలిచివేసిందని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి తెలిపారు. సంఘటన స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించి మీడియాతో మాట్లాడారు. మృతురాలి కుటుంబానికి టీటీడీ నుంచి రూ.5 లక్షలు, అటవీశాఖ నుంచి రూ.5 లక్షలు అందిస్తామని చెప్పారు. బాలిక ఒంటరిగా వెళ్లడాన్ని సీసీ కెమెరాల్లో గుర్తించామన్నారు. బాలిక నరసింహస్వామి ఆలయానికి సమీపంలో నడకదారి నుంచి పక్కకు అటవీ ప్రాంతంలోకి ఆడుకుంటూ వెళ్లినట్లు అనుమానిస్తున్నామన్నారు. ఎందుకంటే.. బాలిక ఆటవస్తువులు అటవీ ప్రాంతంలోనే దొరికాయని తెలిపారు. ఈ సమయంలో వన్యమృగం దాడిచేసి తీసుకెళ్లినట్లు తెలుస్తోందన్నారు.

భద్రత విషయంలో రాజీలేదు : భూమన

ఇక తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి స్పష్టంచేశారు. సంఘటనకు దారితీసిన పరిస్థితులపై శనివారం సాయంత్రం అధికారులతో ఆయన మాట్లాడారు. అనంతరం బాలిక లక్షిత మృతదేహం లభించిన ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ ఘటనలో ఎవరి నిర్లక్ష్యంలేదని ఆయన మీడియాతో అన్నారు.

అధికారులతో అత్యవసర సమావేశం

మరోవైపు.. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో మరింత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు టీటీడీ, అటవీ పోలీస్ అధికారులతో జరిపిన అత్యవసర సమావేశంలో ఈఓ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నడకమార్గంలో 500 సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తామని చెప్పారు. నడక మార్గానికి ఇరువైపులా కంచె ఏర్పాటుచేసేందుకు సమగ్ర నివేదిక అందించాలని డీఎఫ్‌ఓను ఆయన ఆదేశించారు. అలాగే, వన్యమృగాన్ని బంధించేందుకు బోను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతీ 100 మంది భక్తుల గుంపునకు సెక్యూరిటీ సిబ్బంది ఏర్పాటుకు అనుమతించనున్నట్లు చెప్పారు. అలాగే, నడకదారుల్లో మ.2–3 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతించే అంశాలపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. చిన్నపిల్లలతో నడకమార్గాల్లో వచ్చే తల్లిదండ్రులు వారిని జాగ్రత్తగా చూసుకోవాలని ఈఓ విజ్ఞప్తి చేశారు. సీసీఎఫ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ, బోన్ల సాయంతో నడక మార్గాల్లో సంచరించే వన్య మృగాలను బంధిస్తామన్నారు.



తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ శనివారం ఉదయం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో చీఫ్ జస్టిస్‌కు పండితులు వేద ఆశీర్వాదం చేశారు. అలాగే ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రంగస్వామి నటరాజ్ కూడా స్వామివారిని దర్శించుకున్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరం

- బ్రాహ్మణ పరిషత్ ఉద్యోగులకు అందని జీతాలు
- ప్రభుత్వ సలహాదారు రమణాచారి వ్యాఖ్యలు

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ విషయాన్ని ఎవరు ఒప్పుకున్నా.. ఒప్పుకోకపోయినా వాస్తవమని ఆయన స్పష్టం చేశారు. శనివారం రాత్రి హిమాయత్‌నగర్‌లోని ఓ హోటల్లో జరిగిన జానపద కళాకారుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో కేవీ రమణాచారి మాట్లాడుతూ.. తాను అధ్యక్షత వహిస్తున్న బ్రాహ్మణ పరిషత్‌లోని ఉద్యోగులకు ఈనెల ఇంకా జీతాలు విడుదల కాలేదని తెలిపారు. ఈ విషయాన్ని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు మూడు నెలలుగా పెన్షన్లు రావడం లేదని, డబుల్ బెడ్‌రూమ్‌లు వచ్చేలా చొరవ చూపాలని కోరిన తెలంగాణ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర స్థాయి నేతలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నిరసనలు, డిమాండ్ల ద్వారానే ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకెళ్లాలని వారికి సూచించారు. అంతకుముందు ఇటీవల మరణించిన గద్దర్, సాయిచంద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జిల్లా వార్తలు

రాష్ట్రస్థాయి రెడ్ రన్‌లో విజేతగా సమ్రీన్



ట్రోఫీ అందుకుంటున్న సమ్రీన్

ఖమ్మంస్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణమండలి ఆధ్వర్యాన శనివారం హైదరాబాద్‌లో 5కే రెడ్ రన్ నిర్వహించారు. ఈ పోటీల్లో ఖమ్మం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎస్‌కే సమ్రీన్‌కు ప్రథమస్థానం లభించింది. ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఆమె విజేతగా నిలిచి రూ.35 వేల నగదు బహుమతితోపాటు ట్రోఫీ అందుకుంది. ఈ సందర్భంగా సమ్రీన్‌ను డీఎంహెచ్‌ఓ మాలతి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ ప్రవీణ, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ మేనేజర్ సత్యకుమార్, ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ జకీరుల్లా, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు ఎన్.శ్రీనివాస్, మిల్టన్, సర్వేశ్వర్, పీడీ డాక్టర్ బి.వెంకన్న, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్‌లు ఎండీ గౌస్, అక్బర్‌అలీ అభినందించారు.

కోదండరాం తదితరుల అరెస్టు గర్హనీయం

ఖమ్మంమయూరిసెంటర్: గ్రూప్–2 పరీక్ష వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ మౌన దీక్షకు పూనుకున్న ప్రొఫెసర్ కోదండరాం, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ గన్‌పార్కులో దీక్ష చేయనున్నట్లు ముందుగానే ప్రకటన చేసినా, ప్రభుత్వం, పోలీసులు నాయకులు పలువురిని అరెస్ట్ చేయగా, మరికొందరిని గృహనిర్బంధం చేశారని ఆరోపించారు. తొమ్మిదేళ్ల ఉద్యోగాల భర్తీని పట్టించుకోని ప్రభుత్వం ఇప్పుడు ఎన్నికలు వస్తుండడంతో హడావుడి చేస్తుండగా నిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యాన గ్రూప్–2 పరీక్ష వాయిదా వేయాలని డిమాండ్ చేస్తే అరెస్ట్ చేయడం సరికాదని, ఇకనైనా పరీక్షను వాయిదా వేయాలని రంగారావు డిమాండ్ చేశారు.

బీట్ ఆఫీసర్‌పై వేటుతో సరిపెడతారా?

- మొత్తం వ్యవహారంలో ఒక్కడినే బాధ్యుడిని చేస్తే ఎలా?
- జేకేఓసీ నిర్వాసిత జాబితా పెరగడంపై విచారణలో అడుగడుగునా నిర్లక్ష్యం
- ప్రాథమిక దశ నుంచి పరిశీలిస్తే బయటపడనున్న అక్రమాలు
- ఆ దిశగా పరిశీలించని అటవీశాఖ



గ్రామసభలో నిర్వాసిత జాబితాపై అభ్యంతరం తెలుపుతున్న రైతులు (ఫైల్)

ఇల్లెందురూరల్: సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియాలోని జేకేఓసీ ప్రాజెక్టు ప్రారంభం కోసం సింగరేణి, రెవెన్యూ, అటవీశాఖలు సంయుక్తంగా చేపట్టిన సర్వే, కసరత్తు ఆదిలోనే వివాదాస్పదమవుతోంది. ఓసీ నిర్వాసిత జాబితాలో రైతుల పేర్ల నమోదు విషయమై అక్రమాలు చోటుచేసుకున్నాయని గుర్తించిన అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టారు. అయితే, పూర్తిస్థాయిలో విచారణ చేయకుండానే చిరుద్యోగి అయిన బీట్ అధికారిపై సస్పెన్షన్ వేటు వేసి చేతులు దులుపుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అసలు ఈ మొత్తం వ్యవహారంలో చాలామంది హస్తం ఉండగా ఒక్కరినే బాధ్యుడిని చేయడం ఏంటనే చర్చ సాగుతోంది.

రైతుల జాబితాను పరిశీలించరా?

ఇల్లెందులో జేకే–5 ఓసీలో బొగ్గు నిల్వలు తరిగిపోవడంతో సింగరేణి యాజమాన్యం జేకేఓసీ ఏర్పాటుకు సన్నాహాలు చేపట్టింది. ఈ మేరకు ఇల్లెందు మండలం సీఎస్పీ బస్తీ గ్రామ పంచాయతీ సమీపాన అటవీశాఖ పరిధిలోని సర్వే నంబర్ 549 పరిధిలో 261.33 హెక్టార్ల భూభాగాన్ని గుర్తించారు. ఇందులో 154 హెక్టార్లు అటవీభూభాగం కాగా, మిగిలింది రెవెన్యూ భూమి అని తేలింది. అయితే, అటవీశాఖ పరిధిలోని భూమిలో కొందరు సాగు చేసుకుంటున్నట్లు సింగరేణి అధికారులు గుర్తించారు. కానీ, 52 మంది రైతులు వాస్తవంగా సాగులో ఉన్నప్పటికీ, ఓ గిరిజనేతరుడు రంగప్రవేశం చేసి.. జరిపిన క్రయవిక్రయాల కారణంగా జాబితాలో కొత్తగా మరో 36 పేర్లు చేరాయి. ఆతర్వాత 2021 జూలై 31 నాటికి ఈ సంఖ్య 107కు చేరగా.. ఆర్‌ఓఎఫ్‌ఆర్ గ్రామసభ నాటికి 114కు పెరగడం గమనార్హం. ఈ అంశంపై విచారణ చేపట్టేందుకు అధికారులు దృష్టి సారించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ప్రాథమిక దశ నుంచే అక్రమాలు

సింగరేణి, రెవెన్యూ, అటవీశాఖల అధికారులు జేకే ఓసీ నిర్వాసిత భూభాగాన్ని గుర్తించాక సాగు చేస్తున్న రైతుల గుర్తింపునకు ఎంజాయ్‌మెంట్ సర్వే చేపట్టారు. ఈ క్రమంలోనే కొన్ని కొత్త పేర్లు జాబితాలో చేరగా కొన్నాళ్లకు మరికొన్ని పేర్లు నమోదైనట్లు సమాచారం. నిర్దేశించిన భూమిలో ఖాళీగా ఉన్న ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పలువురు రైతుల పేర్లను అధికారులు జాబితాలో చేర్చారని తెలిసింది. అలాగే, మరో గిరిజనేతరుడు చేపట్టిన కొనుగోళ్లపై దృష్టి సారించిన పెద్దలు అందులో ఎనిమిది పేర్లు, గతంలో పేర్కొన్న విధంగా 36 మంది నుంచి ఇద్దరి పేర్లను తొలగించి వారు అనుకున్న పేర్లు చేర్చగా... ఎంజాయ్‌మెంట్ జాబితాలో ట్రాక్ నంబర్ 50 నుంచి 67 వరకు పేర్లు మారినట్లు ఆరోపణలున్నాయి. ఇందులో కొందరు అధికారుల బంధువులకు భూమి లేకున్నా నిర్వాసితులుగా చేర్చారనే విమర్శలు వస్తున్నాయి. ఇదే సమయాన పేర్లు చేరుస్తామని పలువురు డబ్బు వసూలు చేసినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించినా ఒక్క బీట్ అధికారిని మాత్రమే బాధ్యుడిగా చేయడం ప్రశ్నార్థకంగా మారింది.

ప్రక్రియలో ఎవరెవరు బాధ్యులంటే..

ఓసీ నిర్వాసిత ప్రాంత ఎంజాయ్‌మెంట్ సర్వే, గ్రామసభ మొత్తం ఆర్డీఓ పర్యవేక్షణలో సాగింది. నిర్వాసిత ప్రాంతంలో అటవీ భూమి, రైతుల వివరాలను అటవీశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో నిర్ధారించాల్సి ఉంటుంది. అయినా జాబితాలో అదనపు పేర్లు ఎలా చేరాయి.. ఇందుకు కారకులెవరనేది పరిశీలించకుండా కేవలం డబ్బు వసూలు చేసిన వారి విషయంపై విచారణ నిర్వహించడం గమనార్హం. కాగా, జేకేఓసీ నిర్వాసిత ప్రాంతానికి ఆనుకుని ఉన్న అటవీభూమిలో సర్వే సాగుతుండగానే సుమారుగా రెండు ఎకరాల విస్తీర్ణంలో గుర్తుతెలియని వ్యక్తులు అడవిని నరికివేశారు. ఈ విషయంలో సమగ్రంగా విచారణ జరుపుతామని చెప్పినా అధికారులు ఆ ఊసెత్తడం లేదు.

అన్ని అంశాల్లో విచారణ



జేకేఓసీ నిర్వాసిత జాబితాకు సంబంధించి ఎంజాయిమెంట్ సర్వేలో ప్రతీ ప్రక్రియపై సమగ్రంగా విచారణ జరుగుతోంది. నిర్వాసిత జాబితాలో పేర్లు ఎందుకు పెరిగాయి. భూమి క్రయవిక్రయాలు ఎలా జరిగాయనే అంశంపై విచారణ చేపట్టాలని అప్పటికే ఆదేశించాం.

–కె.వెంకన్న, అటవీశాఖ ఇల్లెందు డివిజన్ అధికారి

'సింగరేణి'లో ఉత్తమ కార్మికులు వీరే..



మోహన్‌బాబు సాంబశివరావు భూక్యా సక్రు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో విధులు నిర్వర్తించే వారి నుంచి ఏటా పంద్రాగస్టుకు పలువురు ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసి కొత్తగూడెంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సన్మానించనున్నారు. ఈసారి సంస్థ వ్యాప్తంగా 12 మంది ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసిన అధికారులు శనివారం వివరాలు వెల్లడించారు. వారిలో మణుగూరు ఏరియా నుంచి ఈపీ ఎలక్ట్రీషియన్ జి.మోహన్‌బాబు, ఇల్లెందు ఏరియా నుంచి ఫిట్టర్ ఆర్.సాంబశివరావు, కొత్తగూడెం నుంచి ఈపీ ఆపరేటర్ భూక్యా సక్రు ఉన్నారు. అలాగే, భూపాలపల్లి ఏరియా నుంచి హెడ్ ఓవర్‌మెన్ పి.నారాయణమూర్తి, ఆర్‌జీ–3 ఏరియా నుంచి ఈపీ ఆపరేటర్ కె.మల్లేశ్, ఆండ్రియాల ప్రాజెక్టు నుంచి ఎల్‌హెచ్‌డీ ఆపరేటర్ అబ్దుల్ హమీద్, జీడీకే–2 ఏరియా నుంచి ఈపీ ఆపరేటర్ దినేశ్‌సింగ్, ఆర్‌జీ–1 ఏరియా నుంచి ఫిట్టర్ ఎస్.కృష్ణమాచారి, బెల్లంపల్లి ఏరియా నుంచి ఫోర్‌మెన్ శ్రీరామగిరి శ్రీనివాస్, మందమర్రి ఏరియా నుంచి ఈపీ ఆపరేటర్ వి.రమేశ్, శ్రీరాంపూర్ ఏరియా నుంచి ఎస్‌డీఎల్ ఆపరేటర్ పి.తిరుపతి, ఎన్‌టీపీసీ నుంచి సీనియర్ అసిస్టెంట్ ఎం.మహేశ్ ఎంపికైనట్లు అధికారులు వెల్లడించారు.

బుట్టదాఖలైన ఉచిత విద్య హామీ

- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య
- ఇల్లెందులో పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, పక్కన ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ తదితరులు

ఇల్లెందు: స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటుతున్నా అట్టడుగు వర్గాలు, పేదలకు ఉచిత విద్యనందించడంలో పాలకులు విఫలమయ్యారని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లెందులోని ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో మూడు రోజుల పాటు జరగనున్న పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులు శనివారం మొదలయ్యాయి. ఈ సందర్భంగా ఆయన ప్రారంభోపన్యాసం చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చడంతో పేదలు చదువుకు దూరమవుతున్నారని, తద్వారా ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రెండు దఫాలు అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి హామీలను విస్మరించిందని ఆరోపించారు. ఇక కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం సైతం అదే దారిలో పయనిస్తోందని తెలిపారు. అనంతరం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ.. 'నూతన జాతీయ విద్యా విధానం – పర్యవసానాలు' అంశంపై మాట్లాడుతూ విద్యార్థుల్లో లౌకిక, ప్రజాస్వామిక, శాస్త్రీయ భావాలను పెంపొందించాలని రాజ్యాంగం పేర్కొంటే.. బీజేపీ ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పుస్తకాల్లో శాస్త్రీయ భావాలను తొలగించి కుల, మత, జాతి వైషమ్యాలను రెచ్చగొట్టేలా పాఠ్యాంశాలను మారుస్తోందని తెలిపారు. యూనివర్సిటీల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిన పాలకులు ప్రొఫెసర్ పోస్టులను కూడా భర్తీ చేయటం లేదని మండిపడ్డారు. ఈ మేరకు ప్రభుత్వ విద్యను పరిరక్షించుకునే బాధ్యత విద్యార్థి, యువజనులపై ఉందని తెలిపారు. ఆ తర్వాత పీడీఎస్‌యూ యూనివర్సిటీల కోఆర్డినేషన్ జాతీయ కన్వీనర్ ఎస్.నాగేశ్వరరావు 'గతి తర్కం–హేతువాదం' అంశంపై మాట్లాడారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామకృష్ణ ఎస్.ఆజాద్ పీడీఎస్‌యూ జెండాను ఆవిష్కరించారు. అలాగే, విద్యార్థి అమరవీరుల సంతాప తీర్మానం ప్రవేశపెట్టి మౌనం పాటించారు. ఈ సభలో పీడీఎస్‌యూ నాయకులు కాంపాటి పృథ్వీ, నరేందర్, భాస్కర్, ఎస్.అనిల్, నర్సింహారావు, కె.సంధ్య, స్వాతి, సాయి, నరేందర్, వెంకటేశ్, నరేశ్, సుమంత్, హలీం పాషా, తిరుపతి, దీపిక, పవిత్ర, గణేశ్, అషూర్, నవీన్, కావ్య, సీతారాం, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ కళాశాలల్లో వివిధ సబ్జెక్టులు బోధించేందుకు తాత్కాలిక పద్ధతిపై అధ్యాపకులను నియమించనున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. డిగ్రీ, పీజీలో 55 శాతం మార్కులతో పాటు ఏదైనా యూనివర్సిటీ నుంచి బీఈడీ పూర్తిచేసిన మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. గుండాల, సుదిమళ్ల, వైరా, తిరుమలాయపాలెం, సింగరేణి, అంకంపాలెం, ఖమ్మం కళాశాలల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

ఆసక్తి, అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

28 మంది వైద్యులకు నియామక ఉత్తర్వులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలోని ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసి ఎంపిక చేశారు. ఈ మేరకు ఎంపికైన 28 మందికి శనివారం సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం కట్టా బసవయ్య కొత్తగూడెంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. సంస్థలో 30 మంది వైద్యులను కాంట్రాక్టు విధానంలో నియమించేందుకు జూలై 31న నిర్వహించిన ఇంటర్వ్యూలకు 84 మంది హాజరయ్యారని తెలిపారు. వారిలో 30 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అధికారులు ధన్‌పాల్ శ్రీనివాస్, పి.వేణుగోపాల్, నాగరాజు, డి.నాగేశ్వరరావు, సంతోష్‌కుమార్, వెంకటరమణ పాల్గొన్నారు.



వైద్యులకు నియామకపత్రాలు అందజేస్తున్న అధికారులు

సూపర్‌లగ్జరీ బస్సుల్లో వాటర్ బాటిళ్లు..

సత్తుపల్లిటౌన్: ఆర్టీసీ సూపర్‌లగ్జరీ బస్సుల్లో ప్రయాణించే వారికి అర లీటర్ జీవా వాటర్ బాటిల్లు అందించనున్నారు. ఏసీ బస్సులతో పాటు సూపర్ లగ్జరీ ప్రయాణికులకు కూడా వాటర్ బాటిళ్లు ఇవ్వాలని యజమాన్యం నిర్ణయించింది. ఈమేరకు సత్తుపల్లి డిపోలో శుక్రవారం డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి బాటిళ్ల పంపిణీని ప్రారంభించారు. ఉద్యోగులు ఖుద్దూస్, రాంకుమార్, జి.వెంకటేశ్వర్లు, డీవీఆర్‌ఎస్.రావు, వి.ప్రభాకర్, కిన్నెర ఆనందరావు పాల్గొన్నారు.



వాటర్ బాటిళ్లతో డీఎం, ఉద్యోగులు